

ఉత్సాహంగా మ్యూజిక్ కన్సర్ట్

జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో కాలేజ్ ఫెస్ట్ వేడుకలు కొనసాగుతున్నాయి. మూడో రోజు మ్యూజిక్ కన్సర్ట్ నిర్వహించారు. 8లో▸

ప్రతీ కూలీకి ఉపాధి కల్పించాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతీ కూలీకి ఉపాధిహామీ సభ్యుడిగా పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఆర్డీవో కార్యాలయంలో ఎంపీడీవోలు, ఏపీవోలు సంబంధిత శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉపాధి కూలీలకు వంద శాతం పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీడీ ఓన ప్రసాద్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.8 /28.9

రోజంతా ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతాయి. ఎండ తీవ్రతకు ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం

నిర్మల్ టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్స్ కప్-2023 జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 20 లోగా తమ పేర్లను కార్యాలయంలో నమోదు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి క్రాంతికుమార్ తెలిపారు. క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సీఎం కప్ నిర్వహిస్తుందన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ పోటీలు ఈనెల 22 నుంచి 24 వరకు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరుగుతాయని పేర్కొన్నారు. 15 నుంచి 36 సంవత్సరాల వయసు ఉన్న క్రీడాకారులతోపాటు మండల స్థాయిలో విజేతలైన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్(స్త్రీ, పురుషుల టీమ్స్), బాస్కెట్‌బాల్ (స్త్రీ, పురుషుల టీమ్స్), బాక్సింగ్(పురుషులు), హ్యాండ్ బాల్(స్త్రీ, పురుషుల టీమ్స్), (స్విమ్మింగ్ స్త్రీ, పురుషులు), రెజ్లింగ్(పురుషులు), అథ్లెటిక్స్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

నానో యూరియాతో అధిక దిగుబడి



ధాన్యం తూకం వేస్తున్న వ్యవసాయ అధికారులు

నర్సాపూర్(జి): రైతులు 45 కిలోల యూరియా బస్తా కంటే 500 గ్రాముల నానో యూరియా వాడకంతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ అధికారులు ప్రయోగాత్మకంగా నిరూపించారు. మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన రైతు చెన్న లింగం యాసంగి వరి పొలంలో యూరియాకు బదులుగా నానో యూరియా వాడి అధిక దిగుబడి సాధించినట్లు జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్, ఏవో జాదవ్‌సాయి కిరణ్, ఏఈవో గణేశ్ పేర్కొన్నారు. యూరియా, నానో యూరియా వాడగా వచ్చిన ధాన్యం తూకం వేశారు. నానో యూరియా వాడిన పొలంలో అధిక దిగుబడి వచ్చినట్లు నిర్ధారించారు. రైతులు అపోహలు వీడి నానో యూరియాతో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారులు సూచించారు.

నర్సరీల్లో మొక్కలను రక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో శ్రీలత

పెంబి: నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని డీపీవో శ్రీలత అన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామ పంచాయతీ నర్సరీలను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నర్సరీల్లో మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శానిటేషన్ కార్యక్రమం ప్రతీ గ్రామంలో నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించేలా గ్రామస్తులకు అవగాహన నిర్వహించాలని తెలిపారు. డీపీవో వెంట సర్పంచ్ మహేందర్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, టీఏలు ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

నిర్మల్: జర్నలిస్టులకు ఇళ్లస్థలాలను కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ డాక్టర్ రామకృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. ఖమ్మం జర్నలిస్టులకు మేలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

నిర్మల్‌ఖిల్లా: జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి నూనెల శ్రీనివాస్ రఅన్నారు. 32 జిల్లాల జర్నలిస్టులకు స్థలాలు ఇవ్వాలన్నారు.

ముంపు.. సమస్యకు చెక్..!



2021 జూలైలో నీట మునిగిన జిల్లాకేంద్రంలోని జీఎస్ఆర్ కాలనీ

- రెండేళ్లుగా వరద బీభత్సం
- నిండా మునుగుతున్న జిల్లా
- ప్రాజెక్టులు, బల్దియాల్లో లోపాలు
- ఏటా ప్రజలకు ముంపు కష్టాలు
- ఈసారి ముందే దృష్టిపెట్టిన కలెక్టర్



జలమయమైన జిల్లాకేంద్రంలోని శివాజీచౌక్



కడెం ప్రాజెక్టును గురువారం సందర్శించిన కలెక్టర్

నిర్మల్: రెండేళ్లుగా జిల్లాను జోరు వానలు ముంచేస్తున్నాయి. స్థానికంగా కుండపోత పోసినట్లు పడుతున్న వర్షాలు చాలవన్నట్లు ఎగువ నుంచి భారీ వరదలు ముంచుకొస్తున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు భైంసా పట్టణం జలమయమవుతున్నాయి. లోతట్టు, పరీవాహక ప్రాంతాలన్నీ నీటమునుగుతున్నాయి. రెండేళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని జీఎస్ఆర్ కాలనీ ఘటన రాష్ట్రాన్నే కలవరపెట్టింది. స్వర్ణవాగు ఒడ్డున కట్టుకున్న ఈ కాలనీలో రెండంతస్తుల ఇళ్లు సైతం మునిగాయి. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని స్థానికుల సాయంతో కాలనీవాసులు బయటపడ్డారు. గతేడాది కడెం ప్రాజెక్టు ఉంటుందా.. కొట్టుకుపోతుందా.. అన్నట్లుగా అత్యంత భారీ వరద వచ్చిపడింది. పరీవాహక ప్రాంతాలన్నీ నీటమునిగాయి. రెండేళ్లుగా మునుగుతున్న జిల్లాకు ఈసారి ముంపు ముప్పు తప్పించాలన్న ఉద్దేశంతో కలెక్టర్ వరుణ్‌రెడ్డి ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. ఈనేపథ్యంలో ప్రాజెక్టులు, పట్టణాలపై దృష్టిపెట్టారు.

2021లో మునిగిన నిర్మల్..

2021 జులైలో భారీ వర్షాలకు జిల్లా కేంద్రంలోని సిద్ధాపూర్‌లోని జీఎస్ఆర్ కాలనీ మొత్తం మునిగిపోయింది. స్థానికంగా కురుస్తున్న భారీ వర్షానికి తోడు ఎగువన స్వర్ణప్రాజెక్టు నుంచి ఒక్కసారిగా నీటిని వదలడంతో ఆ వరదంతా వాగు ఒడ్డునే గల కాలనీని ముంచెత్తింది. స్థానికులు, గంగపుత్రులు, పోలీసులు, యువకులు అతికష్టం మీద కాలనీవాసులను ఒడ్డుకు చేర్చారు. నిర్మల్‌లోని శివాజీచౌక్, శాస్త్రినగర్, ఇంద్రానగర్, శాంతినగర్, దివ్యనగర్, ప్రియదర్శిని నగర్, ఈద్‌గాం, మంజులాపూర్ కాలనీలన్నీ మునిగిపోయాయి. అదే నెలలో సుద్దవాగు పొంగడంతో భైంసా పట్టణం సైతం జలయమైంది. ఆటోనగర్ మొత్తం నీటమునిగింది. గోకుల్‌నగర్, వినాయక్‌నగర్, భాగ్యలక్ష్మినగర్, గణేశ్‌నగర్, రాహుల్‌నగర్‌లను వరదముంచెత్తింది.

'కడెం' కొట్టుకుపోతుందా..

2021 వరద బీభత్సాన్ని మరువకముందే 2022లో ఏకంగా జలప్రళయాన్నే చూడాల్సి వచ్చింది. గతేడాది కూడా జులైలోనే భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల నుంచి బీభత్సంగా వరద ముంచెత్తింది. ప్రధానంగా కడెం ప్రాజెక్టుకు చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో 6.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఇక కడెం ఆనకట్ట ఏ క్షణానైనా కొట్టుకుపోతుందన్నట్లుగా ప్రాజెక్టు పైనుంచి వరద ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు వారం రోజులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని గడిపారు. అప్పటికే ప్రాజెక్టు ఎడమ కాలువ తెగింది. రెండుగేట్ల కౌంటర్ వెయిట్లు, పెంబి మండలంలోని పస్పుల కొత్త వంతెన, కడెం దిగువన పాండ్వాపూర్ బ్రిడ్జి కొట్టుకుపోయాయి. అధికారులు వెనువెంటనే లోతట్టు మొత్తం ఖాళీ చేయించారు. ప్రాణనష్టం జరగలేదు కానీ.. అపార పంట, ఆర్థిక నష్టాలు మిగిలాయి.

లోపాలే ముంచేశాయి..

రెండేళ్లుగా జిల్లా వరదల్లో మునగడానికి వర్షం ఎంత కారణమో.. అంతకుమించి స్థానికంగా లోపాలూ అంతే కారణంగా నిలిచాయి. జిల్లాకేంద్రంలోనే లోతట్టు ప్రాంతాల ను ఏమాత్రం దృష్టిలో పెట్టుకోకుండా, ఎ లాంటి ముందస్తు చర్యలు చేపట్టకుండా చేతులెత్తేశారు. ఇవే ఆయా కాలనీలను ముంచేశాయి. జీఎస్ఆర్ కాలనీని మరీ వాగు ఒడ్డునే ఏర్పాటు చేయడం, నాలాలు, కందకాలను ఆక్రమించడం, వాటిని మున్సిపాలిటీలు చూసీచూడనట్లు వదిలేయడం ఇవన్నీ జిల్లా ను ముంచెత్తాయి. ప్రాజెక్టుల మెయింటనెన్స్ లోపాలనూ వరదలు బయటపెట్టాయి. సమయానికి గేట్లు మొరాయించడం, వరదను డ్యూటీలో ఉన్న సిబ్బంది అంచనా వేయలేకపోవడం జిల్లాను ఇబ్బంది పెట్టాయి. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఈసారి ముందుచూపు పెట్టినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ప్ర ధాన ప్రాజెక్టులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడి లోపాలు, సమస్యలను వెంట నే పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణాల్లో పారిశుధ్యం, వరద ముప్పు పరిస్థితుల నివారణ చర్యలను చేపట్టాలన్నారు. ఈమేరకు ఆయా శాఖలు పనులను చేపడుతున్నాయి.

చర్యలు చేపట్టాం..

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రాజెక్టుల సమస్యలపై దృష్టిపెట్టాం. గేట్లకు గ్రీజ్ పెట్టడం, డ్యామేజీల పరిశీలన చేపడుతున్నాం. వచ్చే వానాకాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నాం.

– రామారావు, ఇరిగేషన్ ఈఈ

జిల్లాలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు



కడెం: జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. వారం రోజులుగా నిప్పులు కురిపిస్తున్నాడు. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో రికార్డుస్థాయిలో నమోదవుతున్నాయి. ఐదు రోజులుగా చాలా ప్రాంతాల్లో 43 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గడం లేదు. శుక్రవారం కడెంలో 45.1 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఇది రాష్ట్రంలోనే రెండో స్థానం. కరీంనగర్ జిల్లా వీణవంక, నల్గొండ జిల్లా దామెరచెర్లలో 45.4 డిగ్రీల సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక, జిల్లాలోని భైంసాలో 44.1, సారంగపూర్ మండలం జామ్‌లో 43.9, ఖానాపూర్ మండల కేంద్రంలో 43.3, మామడలో 43.2, తానూర్, లక్ష్మణచాంద మండలం వడ్యాల్‌లో 43.1, కడెం మండలం లింగాపూర్‌లో 42.9, నిర్మల్ రూరల్ మండలం అక్కాపూర్, దస్తురాబాద్ మండలం బుట్టాపూర్‌లో 42.7, ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్‌లో 42.5, పెంబి మండల కేంద్రం, మామడ మండలం పొన్కల్‌లో 42.3, సారంగాపూర్ మండలం బీరవెల్లిలో 42.2, లక్ష్మణచాంద, కుభీర్ మండల కేంద్రాల్లో 42.1 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులకు టిక్కెట్లు ఇవ్వాలి

- సీపీఎస్ జిల్లాఅధ్యక్షుడు కృష్ణారావు

నిర్మల్ ఖిల్లా: తెలంగాణలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులకు అన్ని పార్టీలు టిక్కెట్లు ఇవ్వాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు ప్రధాన రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. టి క్కెట్లు ఇచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులకూ ప్రజా సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందితో స హా కలిపి ఎనిమిది లక్షల మందికిపైగా ఉన్నారని పేర్కొన్నారు. వీరి కుటుంబ సభ్యుల ఓట్లతో కలిపి దాదాపు 50 లక్షల ఓట్లపైనే ఉంటాయని తెలిపారు. అన్ని పార్టీల రాష్ట్ర అధ్యక్షులను కలిసి వినతిపత్రం ఇస్తామని చెప్పారు.

సమ్మెకు సమాయత్తం!



కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

- సిద్ధమవుతున్న రేషన్ డీలర్లు
- ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్
- సమస్యలపై అదనపు కలెక్టర్‌కు వినతి
- అద్దె, కరెంటు బిల్లులచెల్లింపునకు చాలడం లేదని ఆవేదన

నిర్మల్‌చైన్‌గేట్: పలు శాఖల్లో సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మెబాట పట్టడంతో ఆ శాఖల్లో పనులు నిలిచిపోయాయి. మొన్నటి వరకు జేపీఎస్‌లు, అంతకు ముందు వీఆర్ఏలు సమ్మె చేశారు. ప్రస్తుతం వీఓఏలు సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ తరుణంలో రేషన్ డీలర్లు కూడా సమ్మెకు సమాయత్తం అవుతున్నారు. గౌరవ వేతనం ఇవ్వాలనే ప్రధాన డిమాండ్ సమ్మెకు రెడీ అవుతున్నారు.

జిల్లాలో 412 మంది డీలర్లు..

జిల్లాలో 412 మంది డీలర్లు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 9 రకాల సరుకులు రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.70 కమీషన్ చెల్లిస్తుంది. అందులో హమాలీ దిగుమతి రూ.10 పోను రూ.60 మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక షాపుకు 80 క్వింటాళ్లు కేటాయిస్తే దాంతో కమీషన్ రూ.5,600 వస్తే అందులో అద్దె రూ.2,500, హమాలీ చార్జీలు రూ.800 పోనూ డీలర్‌కు మిగిలేది రూ.2,300 మాత్రమే అని పేర్కొంటున్నారు. ఇందులో నుంచి కరెంట్ బిల్లు, ఇతరత్రా చెల్లింపులతో నెలకు రూ.2 వేలు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్నేళ్లుగా ఆందోళనలు..

గౌరవ వేతనం ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో రేషన్ డీలర్లు కొన్నేళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. రాస్తారోకోలు, ధర్నాలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు, ఉన్నతాధికారులకు వినతులను అందించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కానీ హామీ నెరవేరలేదు. ఈ నేపథ్యంలో ఈసారి ఏకంగా సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈమేరకు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్నారు.

సమస్యలతో సతమతం..

వచ్చే కమీషన్ సరిపోక అద్దె, కరెంట్ బిల్లులు ఇతరత్రా వాటితో నానా తంటాలు పడుతున్నారు. దానికి తోడు తూకంలో తేడాతో సతమతమవుతున్నారు. కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేసినా ప్రభుత్వం స్పందించలేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సమ్మెకు సిద్ధం..

డీలర్ల సమస్యల సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో ప్రతీ జిల్లాలో, మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముందుగా జూన్ 1 నుంచి షాపులు బంద్ చేయాలని నిర్ణయించారు. ఐనా ప్రభుత్వం స్పందించకుంటే జూన్ 5 నుంచి సమ్మెకు వెళ్లడానికి సిద్ధమవుతున్నట్లు నాయకులు చెబుతున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవీ..

- గౌరవ వేతనం ఇవ్వాలి
- రూ.10 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలి
- దిగుమతి హమాలీ చార్జి ప్రభుత్వమే భరించాలి
- శాశ్వత ఆథరైజేషన్ ఇవ్వాలి
- కరోనా సమయంలో చనిపోయిన 98 మంది డీలర్ల కుటుంబ సభ్యులకు నిబంధన లేకుండా డీలర్‌షిప్ ఇవ్వాలి
- కారుణ్య నియామకాల వయసు 50 ఏళ్లకు పెంచాలి
- చనిపోయిన డీలర్ దహన సంస్కారాలకు రూ.50 వేలు ఇవ్వాలి
- క్వింటాల్‌కు కిలో తరుగు ఇవ్వాలి.
- ఈపాస్ మెషీన్‌లో నుంచి క్లోజింగ్ బ్యాలెన్స్ తొలగించాలి
- ప్రతీ డీలర్‌కు హెల్త్ కార్డు ఇవ్వాలి
- బియ్యంతోపాటు ఇతరత్రా సరుకుల పంపిణీ చేయాలి
- షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా మార్చాలి
- డీలర్లకు పట్టణాల్లో రూ.60 వేలు, గ్రామీణ ప్రాంతాలోని రూ.45 వేలు ఇవ్వాలి.

ప్రభుత్వం స్పందించాలి..



రేషన్ డీలర్ల సమస్యలపై ప్రభుత్వం ముందే స్పందించాలి. లేకుంటే జూన్ నుంచి సమ్మెబాట పడతాం. భవిష్యత్ కార్యాచరణ విషయంపై జిల్లాల వారీగా సంఘం జాక్ ఆధ్వర్యంలో సభలు సమావేశాలు నిర్వహిస్తున్నాం.

– పతికే రాజేందర్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు

వీఆర్ఏలకు భరోసా

- 80 రోజుల సమ్మెతో దిగొచ్చిన ప్రభుత్వం
- క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమోదం
- పేస్కేల్ అమలుపై చిగురించిన ఆశలు
- విద్యార్హత ఆధారంగా పరిష్కరించే యోచన
- జిల్లాలో 748 మందికి ప్రయోజనం



కేసీఆర్ ఫొటోకు క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

నిర్మల్‌చైన్‌గేట్: వీఆర్ఏలకు ఎట్టకేలకు భరోసా దొరికింది. పేస్కేల్ వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ గతంలో అసెంబ్లీలో హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం వారి వివరాలను సేకరించింది. వీఆర్ఏల్లో వంశపారంపర్యంగా పనిచేస్తున్నవారు, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైనవారు ఉన్నారు. నిరక్షరాస్యులు మొదలు ఉన్నత చదువులు చదివినవారు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏ విధంగా వారి సేవలు వినియోగించుకోవాలి? వారి విద్యార్హతలు ఏమిటి? ఏయే శాఖల్లోకి తీసుకోవచ్చు? వంటి అంశాలపై ప్రభుత్వం అధ్యయనం చేసింది. చివరకు క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమెదం తెలిపింది. ప్రస్తుతం జిల్లాలో 748 మంది వీఆర్ఏలు పనిచేస్తున్నారు. వీరిలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైనవారు 60 మంది ఉన్నారు.

80 రోజుల సమ్మెతో..

సీఎం కేసీఆర్ 2017, ఫిబ్రవరి 24న ప్రగతి భవన్‌లో వీఆర్ఏలతో సమావేశమై వారి ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేస్తామని, పేస్కేల్ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత 2020, సెప్టెంబర్‌లో వీఆర్వో వ్యవస్థ రద్దు సందర్భంగా అసెంబ్లీ సాక్షిగా వీఆర్ఏలకు మినిమం పేస్కేల్ వర్తింపజేస్తామని ప్రకటించారు. పేస్కేల్ ఇస్తే ప్రభుత్వంపై అదనంగా రూ.260 కోట్ల భారం పడుతుందని లెక్కలు వేశారు. వృద్ధాప్యంలో ఉన్న వీఆర్ఏలు కోరుకుంటే పిల్లలకు ఉద్యోగం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు హామీ ఇచ్చారు. కానీ, ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో గతజూలై 25 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. అక్టోబర్ 14 వరకు 80 రోజులపాటు సమ్మె కొనసాగింది. అక్టోబర్ 14న మరోసారి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రగతి భవన్‌లో వీఆర్ఏ జేఏసీ నాయకులతో సమావేశమయ్యారు. సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తామని, తమపై నమ్మకం ఉంచాలని, ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. మునుగోడు ఎన్నికలు అయిపోగానే డిమాండ్స్ నెరవేరుస్తామని హామీ ఇవ్వడంతో వీఆర్ఏలు సమ్మె విరమించారు. ఎట్టకేలకు క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

పాలాభిషేకం...

వీఆర్ఏల క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమోదం తెలుపడంతో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తమ ఆకాంక్ష నెరవేర్చిన కేసీఆర్‌కు రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం జిల్లా నాయకులు జమాల్, ప్రవీణ్, భోజన్న, రాజన్న, రాధ, వసీం మీర్జా తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్‌పై చర్చ...

జిల్లా వ్యాప్తంగా ఉన్న వీఆర్ఏలలో ఎంత మందిని ఏయే శాఖలకు పంపుతారనే దానిపై రెవెన్యూ వర్గాల్లో చర్చ మొదలైంది. అందరినీ రెవెన్యూ శాఖలోనే కొనసాగిస్తారని.. అయితే డిప్యూటేషన్‌పై ఇతర శాఖ లకు పంపుతారనే వాదన ప్రధానంగా వినిపిస్తోంది. అలాకాకుండా పేస్కేల్ వర్తించేవారు, డైరెక్ట్ రిక్రూటీలను మాత్రమే రెవెన్యూలో కొనసాగించి.. మిగతా వారిని వివిధ శాఖలకు పంపుతారనే చర్చ కూడా జరుగుతోంది. డైరెక్ట్ రిక్రూటీలలో కొందరిని వ్యవసాయశాఖకు కూడా పంపే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని అధికారులు అంటున్నారు.

పెద్దోళ్ల దగ్గరే పెద్ద నోట్లు..!

- రూ.2 వేల నోట్ల ఉపసంహరణపై మిశ్రమ స్పందన
- మంచి నిర్ణయమంటున్న పేద, మధ్య తరగతి జనం
- తప్పు పడుతున్న విపక్ష నేతలు, వ్యాపారులు



నిర్మల్/భైంసాటౌన్/ఖానాపూర్: రూ.2 వేల నోట్ల చలామణిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్‌లో ఉన్న నోట్లను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. వినియోగదారులకు రూ.2 వేల నోట్లు ఇవ్వొద్దని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది.రూ.2 వేల నోట్లు ఉన్నవారు మే, 23 నుంచి సెప్టెంబరు 30లోగా బ్యాంకులు, ఆర్‌బీఐ కార్యాలయాల్లో మార్చుకోవచ్చని తెలిపింది. ఆర్‌బీఐ నిర్ణయంపై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపార, వాణిజ్య వర్గాలు, విపక్ష నేతలు రూ.2 నోట్ల ఉపసంహరణను తప్పు పడుతుండగా, మరికొంతమంది మాత్రం అవినీతిని అరికట్టేందుకు ఈ చర్య సబబేనని సమర్థిస్తున్నారు. సామాన్య ప్రజలకు ఈ నిర్ణయంతో పెద్దగా ప్రభావం ఉండబోదని, వ్యాపార, వాణిజ్యవర్గాలకే కొంత ఇబ్బందిగా మారుతుందంటున్నారు.

ఇబ్బందిగా మారుతుంది..



ఒక్కసారిగా పెద్దనోట్లు రద్దు చేయడంతో వ్యాపార, వాణిజ్యానికి ఇబ్బందిగా మారుతుంది. వ్యాపారులకు పెద్ద మొత్తంలో నోట్లు మార్పిడి చేసుకునేందుకు అవకాశం ఇస్తే బాగుంటుంది. – సుధీర్, వ్యాపారి, నిర్మల్

పేదలకు ఇబ్బంది లేదు..



పెద్ద నోట్ల రద్దు నిర్ణయంతో బడా వ్యాపారులకే ఇబ్బంది, పేద, సామాన్యులకు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రస్తుతం సమాజంలో రూ.2 వేల నోట్లు ఎక్కడా కనిపించడం లేదు.

– రాజు, ఇంటీరియర్ డిజైనర్, నిర్మల్

దాచుకున్నవారికే ఇబ్బంది..



ఆర్‌బీఐ నిర్ణయం మంచిదే. వ్యాపారులకు పెద్దగా ఇబ్బందేమీ లేదు. పెద్ద నోట్లు దాచుకున్నవారికి మాత్రమే ఇబ్బంది. నోట్ల మార్పిడికి ప్రభుత్వం సమయం కూడా ఇచ్చింది. – రాజేశ్, కిరాణ వ్యాపారి, భైంసా

అవినీతి సొమ్ము బయటికొస్తుంది..



పెద్దనోట్ల రద్దుతో అవినీతిపరులు దాచుకున్న సొమ్ము బయటికి వస్తుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే. మార్కెట్‌లో రూ.2 వేల నోట్లు చాలా తక్కువగా చలామణిలో ఉన్నాయి. – శంకర్, కాటన్ వ్యాపారి, భైంసా

మంచి నిర్ణయం..



రూ.2 వేల నోట్లు వెనక్కి తీసుకోవడం మంచి నిర్ణయం. దీంతో నల్లధనం అరికట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ నోట్లు సామాన్యులకంటే ఎక్కువ ధనికుల వద్దే ఉన్నాయి. – నాయిని మారుతి, ఖానాపూర్

గడువు పెంచాలి



గతంలో పెద్దనోట్ల రద్దుతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. తాజాగా రూ.2 వేల నోట్ల ఉపసంహరణతో మరోమారు బ్యాంకుల ముందు బారులు తీరే అవకాశం ఉంది. గడువు పెంచాలి.

– కరిపె రాజశేఖర్, ఖానాపూర్

క్లుప్తంగా

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తులు

ఉట్నూర్‌రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి మండల కేంద్రంలో ఐటీఐ కళాశాలలో మొదటి దఫా అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు తెలిపారు. ఈ నెల 17 నుంచి జూన్ 10లోగా iti,telangana.gov.in వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేటప్పుడు పేరు, తండ్రి పేరు, తల్లి పేరు, పుట్టిన తేదీ ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలని, ఇతర వివరాలకు 9490202037 సంప్రదించాలని కోరారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



ధాన్యం కుప్ప వద్ద రైతులతో మాట్లాడుతున్న బొజ్జు

కడెం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. కేంద్రాల్లో అదనంగా తూకం వేయడంతో పాటుగా మిల్లులో ధాన్యం కోత విధిస్తూ రైతులను నిండా ముంచుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి కొనుగోలు కేంద్రాల్లో దోపిడీని అరికట్టాలని కోరారు. అనంతరం మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గ భవానీ, మండల నాయకులు తుమ్మల మల్లేష్, వాజిద్ ఖాన్, సలీం, బబ్లూ, భూషణం ఉన్నారు.

ఘనంగా భావేయిపేన్



రోకలికి కట్టిన కప్పకు నీళ్లుపోస్తున్న ఆదివాసీలు

బోథ్: మండలంలోని పార్డి (కె) గ్రామంలో భావేయిపేన్ పూజలను ఆదివాసీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం రోకలికి కప్పను కట్టి నీళ్లు పోస్తూ ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు కాళ్లకు, నడుముకు గజ్జెలు కట్టుకుని ఊరంతా తిరిగారు. అనంతరం కప్పను వాగులో వదిలారు. కప్ప ఏ దిశలో వెళ్తుందో ఆ దిశ నుంచి వర్షాలు కురుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ సంప్రదాయాన్ని ప్రతియేటా మే చివరి వారంలో నిర్వహిస్తామని స్థానికులు పేర్కొన్నారు.

అస్వస్థతతో యువకుడి మృతి



సిద్గర్ సాయినాథ్ (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామానికి చెందిన సిద్గర్ సాయినాథ్(38) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన భార్య వనిత స్థానికుల సాయంతో ఆటోలో భైంసా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్థాయీ సంఘాలేవి..?



బోథ్ గ్రామ పంచాయతీలోని సమావేశంలో పాల్గొన్న పాలకవర్గం(ఫైల్)

- పంచాయతీల్లో సలహాలు, సూచనలకు నియామకం
- సంఘాలను విస్మరిస్తున్న పాలకవర్గాలు
- సమావేశాలకు సభ్యులను ఆహ్వానించని వైనం

బోథ్: గ్రామస్థాయిలో లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపినప్పుడే పంచాయతీల పాలన మెరుగవుతోంది. అన్నీ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నెలనెలా పల్లెప్రగతి ద్వారా నిధులు విడుదల చేస్తోంది. అభివృద్ధి పనులు ప్రాధాన్యతా క్రమంలో చేపట్టడంతో పాలకవర్గాలు స్థానిక కమిటీల సూచనలు, సలహాలను పక్కన పెడుతున్న పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. 2014 నుంచి స్థానిక స్థాయీ సంఘాల ఎంపిక తెరపైకి వచ్చింది. ప్రతీ పంచాయతీలో నాలుగు సంఘాలు పాలకవర్గాలకు అనుసంధానంగా ఎంపిక చేశారు. ఏ పంచాయతీలోనూ స్థానిక స్థాయీ సంఘాలకు ప్రభుత్వ కార్యక్రమాల్లో, పాలకవర్గ సమావేశాల్లోనూ ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో కొన్ని పంచాయతీల్లో సభ్యులు సమావేశాల దరిదాపుల్లోకి కూడా రావడం లేదు. చాలా గ్రామాల్లో అసలు స్థాయీ సంఘాలు ఉన్నాయనే విషయం ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రతీ కమిటీలో 15 నుంచి 30 మంది..

జిల్లాలో 468 పంచాయతీలు ఉండగా.. ఒక్కొక్క పంచాయతీలో నాలుగు స్థాయీ సంఘాలను ఎంపిక చేశారు. ప్రతీ కమిటీలో సర్పంచి, కార్యదర్శితో పాటు 15–30 మందితో సభ్యులు ఉంటారు. ఇందులో 50శాతం మంది మహిళలు ఉంటారు. మొత్తం 468 పంచాయతీలకు 1872 స్థాయీ సంఘాలు ఉన్నాయి. ఇందులో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మినహా 14వేల మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వపరంగా గౌరవ వేతనం ఉండదు. గ్రామాభివృద్ధికి వీరి సలహాలు, సూచనలే కీలకం. కనీసం వారిని పాలకవర్గాలు గ్రామ సభలకు కూడా ఆహ్వానించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

సంఘాలు ఎందుకంటే..

- పారిశుద్ధ్యం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటికల నిర్వహణకు సలహాలు ఇవ్వడం.
- వీధిదీపాలను పరిశీలిస్తూ విద్యుత్తు పొదుపునకు సహకరించడం.
- నర్సరీల నిర్వహణకు సూచనలు, మొక్కలు నాటడం, పచ్చదనం పెంపొందించడం.
- ప్రజా పనులు, సంతలకు సంబంధించి పర్యవేక్షణ, సూచనలు చేయడం

సలహాలు స్వీకరిస్తూ అభివృద్ధికి దోహదం

గ్రామ పంచాయతీలు పాలకవర్గాలు స్థాయీ సంఘాల సలహాలు, సూచనలను స్వీకరిస్తే గ్రామాభివృద్ధికి మరింతగా దోహద పడనుంది. స్థాయీ సంఘాలలో అన్ని వర్గాల వారికి ప్రధానంగా మహిళలకు ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంటుంది. గ్రామంలోని ఏ మూలన ఏ సమస్య ఉందనే విషయం స్థాయీ సంఘాల సభ్యుల ద్వారా ఇట్టే తెలిసిపోతుంది. తదనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ సమస్యలను పరిష్కరించుకునే ఆస్కారం ఉంది.

– ధర్మారాణి, డీఎల్పీవో

నా కొడుకును కాపాడండి..

- రోడ్డు ప్రమాదంలో గాయాలు
- నరాల వ్యవస్థ దెబ్బతిని మంచానికే పరిమితం..
- భర్త, రెండేళ్ల కొడుకును వదిలి వెళ్లిన భార్య
- కొడుకు, మనువడిని చూసుకుంటున్న తల్లి
- వైద్యానికి రూ.5లక్షలు కావాలన్న వైద్యులు
- సాయం చేయాలని వేడుకుంటున్న తల్లి



కొడుకుతో మంచంపై మల్లేశ్



అన్నం తినిపిస్తున్న తల్లి రాజవ్వ

17 నెలలుగా మంచానికే.. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలో భార్య వేరే వ్యక్తితో వెళ్లిపోయింది. దీంతో కొడుకు, మనువడికి అన్నీతానై వారిని చూసుకుంటోంది తల్లి రామవ్వ. నరాల వ్యవస్థ దెబ్బతినడంతో 17 నెలలుగా మల్లేశ్ మంచానికి పరిమితమయ్యాడు. అచేతన స్థితిలోని మల్లేశ్‌కు తల్లి రామవ్వ సపర్యాలు చేస్తోంది. చేతిలో చిల్లిగవ్వ లేని మల్లేశ్ తనకు చికిత్స కోసం సాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటుంది. – నాంపెల్లి మల్లేశ్

– ఫోన్ పే నంబర్: 9885424339

కడెం: రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. ఓ రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. కట్టుకున్న వాడితో కడదాక తోడుండాల్సిన భార్య.. భర్తను, కన్న కొడుకును పట్టించుకోకుండా వదిలివెళ్లింది. దిక్కుతోచనిస్థితిలో మంచం పట్టిన కొడుకు, రెండేళ్ల మనువడి ఆలనాపాలన చూస్తూ దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది ఓ తల్లి. ఇది కడెం మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన ఓ అభాగ్యుడి దీనగాథ...

సాయం కోసం ఎదురుచూపు...

కడెం మండలంలోని కొత్త మద్దిపడగా గ్రామానికి చెందిన నాంపెల్లి రామవ్వ–లక్ష్మణ్ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కొడుకు నాంపల్లి మల్లేశ్‌కు లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమారుడు. కుటుంబ పోషణకు మల్లేశ్ బ్యాండ్ కొడుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. 2021 డిసెంబర్‌లో ధర్మాజీపేట్ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో మల్లేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఉస్మానియా, గాంధీ, రిమ్స్ ఆస్పత్రులకు తరలించారు. రూ.లక్ష వరకు ఖర్చు చేసినా నయం కాలేదు. వెన్నుభాగం, నరాల వ్యవస్థ దెబ్బతినడంతో ఆపరేషన్‌కు రూ.4 నుంచి 5లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు.

పొట్ట కోసి.. జుట్టు తీసి

- రిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స
- బాలిక కడుపులో కిలోన్నర వెంట్రుకలు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్



ఆపరేషన్ ద్వారా బాలిక కడుపులో నుంచి బయటకు తీసిన వెంట్రుకలతో కూడిన కణతి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఐదేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించినా తగ్గలేదు. నాలుగైదు రోజులుగా నొప్పి తీవ్రమైంది. దీంతో బాలిక అన్నం తినడం మానేసింది. నీళ్లు మాత్రమే తాగుతోంది. గురువారం కుటుంబీకులు ఆమెను రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు సీటీస్కాన్ చేశారు. కడుపులో వెంట్రుకలతో కూడిన కణతి ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం వైద్యులు శిరీశ్, గణేశ్, నరేశ్ రాథోడ్‌లు అరుదైన ఆపరేషన్ చేసి కిలోన్నర వెంట్రుకలను బయటకు తీశారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజులుగా బాలిక వెంట్రుకలు తింటున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో అవి జీర్ణం కాకుండా జీర్ణాశయంలో ఆగిపోయి గడ్డలుగా మారినట్లు తెలిపారు. ఇలా తినడాన్ని వైద్య భాషలో 'ట్రైకోబెజోఆర్' అని పిలుస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆపరేషన్ విజయవంతం కావడంపై వైద్యులను అభినందించారు. పేదలు రిమ్స్ ఆస్పత్రిలో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వైద్యులు కపిల్, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గణేశ్ రాథోడ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పెర్కగూడ జేసీఎన్ గార్డెన్‌లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్‌టీఎస్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు రామారావు నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్ రాథోడ్ పాల్గొని మాట్లాడారు. జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని, ఉపాధ్యాయుల బదిలీలు ఏజెన్సీ నుంచి ఏజెన్సీ ప్రాంతానికి, మైదాన ప్రాంతం వారికి మైదాన ప్రాంతానికి నిర్వహించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో జిల్లా పరిషత్‌లో వెంటనే బదిలీలు నిర్వహించాలని తెలిపారు. పెండింగ్‌లోని బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్‌ను ప్రకటించాలని, సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పీఈటీ, భాష పండితులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. వీటీతో పాటు 9 సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీటీఎఫ్ జిల్లా నాయకులు దినేశ్, మంగులాల్, సురేశ్, రమేశ్, రామారావు, విశ్వనాథ్, సంతోశ్, ధన్‌రాజ్, జేఏసీ నాయకులు శేషరావు, అడ్వకేట్ జగన్, నాయకులు రాజేశ్, సుమిత్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వృద్ధుడి ఆత్మహత్య



బాల్‌రాజ్ (ఫైల్)

లక్ష్మణచాంద: మద్యానికి బానిసై వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... పీచర గ్రామానికి చెందిన నైనం బాల్‌రాజ్ (60) ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆరోగ్యం బాగలేకపోవడంతో మద్యానికి బానిసై మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వ్యవసాయ చేనులోకి వెళ్లి కేబుల్ వైర్‌తో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాల్‌రాజ్ ఇంటికి రాకపోవడంతో గాలించగా ఉరేసుకుని కనిపించాడు. సంఘటన స్థలానికి ఎస్సై రాహుల్ గైక్వాడ్ చేరుకుని వివరాలు సేకరించారు. భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాల్‌రాజ్‌కు భార్య మల్లవ్వ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

దాడిచేసిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని నీలానగర్‌కు చెందిన షేక్ దావుద్‌పై దాడిచేసిన ముగ్గురిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు వివరాల ప్రకారం.. పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన షేక్ సల్మాన్, జమీర్, అజర్‌లు ఈ నెల 16న రాత్రి 9గంటలకు దావుద్ ఇంటికెళ్తున్న సమయంలో డీటీసీ వద్ద ఆపి దుర్భాషలాడారు. పాత కక్షలతో రాడ్‌తో దాడి చేశారు. ఆయన చికిత్స అనంతరం శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వివాహిత మృతి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ షాక్‌తో చెందిన వివాహిత మృతిచెందింది. ఆమె తండ్రి గంగన్న వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కొక్‌మండి గ్రామానికి చెందిన పడకంటి రేణుక (33) శుక్రవారం ఉదయం కుళాయికి మోటార్ బిగించి నీళ్లు పడుతుండగా విద్యుత్‌షాక్‌కు గురైంది. ఆమెను రిమ్స్‌కు తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

కుటుంబ పోషణ భారమై మహిళ ఆత్మహత్య



వందన మృతదేహం

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వతాండ గ్రామానికి చెందిన జాదవ్ వందన (37) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై వివరాల ప్రకారం... వందన భర్త రాజు గతంలోనే మృతిచెందాడు. అప్పటి నుండి ఇద్దరు కుమారులు, కూతురును పోషించుకుంటోంది. ఇటీవల రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టింది. అందుకోసం రూ.1,50,000 అప్పు తీసుకుంది. వాటిని తీర్చలేక, కుటుంబ పోషణ భారమై శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

మహిళల కోసం పొదుపు పథకం



మాట్లాడుతున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుశ్మిత బెనర్జీ

భైంసా: పోస్టల్ శాఖ మహిళల కోసం ప్రత్యేకంగా చిన్నమొత్తాల పొదుపు పథకం ప్రవేశపెట్టిందని భైంసా పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ సుశ్మిత బెనర్జీ అన్నారు. భైంసాలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. 2023లో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మాల్ సేవింగ్స్ స్కీమ్ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ ప్రత్యేకంగా మహిళల కోసం రూపొందించిందన్నారు. ఈ పథకంలో డిపాజిట్లపై ఏడాదికి 7.5 శాతం వడ్డీ లభిస్తుందని, త్రైమాసికానికి కలిపి ఖాతాలో వడ్డీ జమవుతుందని తెలిపారు. భైంసా డివిజన్‌లోని అన్ని పోస్ట్ ఆఫీస్‌లలో ఈ ఖాతాలు తెరుచుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామాల్లో సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించి ఎక్కువ మొత్తంలో డిపాజిట్లు అయ్యేలా చూడాలని కోరారు. ఈ పథకంలో అందిస్తున్న వడ్డీ పథకంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం పోస్టల్ సిబ్బంది, పోస్టల్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా మ్యూజిక్ కన్సర్ట్



గీతాలు ఆలపిస్తున్న సింగర్స్



కార్యక్రమాన్ని కెమెరాలో బంధిస్తున్న విద్యార్థులు



ఉత్సాహంగా స్టెప్పులు వేస్తున్న వైద్య విద్యార్థులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో కాలేజ్ ఫెస్ట్ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా 2019 బ్యాచ్ ఫైనల్ ఇయర్ ఎంబీబీఎస్ విద్యార్థులు శుక్రవారం మ్యూజిక్ కన్సర్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి వచ్చిన మ్యూజిక్ బ్యాండ్ బృందం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. వారి గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. శనివారం కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య



సిడాం చంద్రకాంత్(ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని చింతలసాంగ్వీ గ్రామానికి చెందిన సిడాం చంద్రకాంత్(22) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... చంద్రకాంత్ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చంద్రకాంత్‌ను 108లో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతిచెందాడు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న బాల కేంద్రం చిన్నారులు

రాష్ట్ర స్థాయి పోటీల్లో బాల కేంద్రం చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రం చిన్నారులు గురువారం రాత్రి నిర్వహించిన ఆన్‌లైన్ రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొన్నారు. అఖిల నటరాజన్ అంతర్ సాంస్కృతిక సంఘం నాగపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ ఒలంపియాడ్ సీజన్- 5 పోటీల్లో పాల్గొని తమ నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా బాలకేంద్రం పర్యవేక్షకులు మిట్టు రవి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కూచిపూడి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు డిసెంబర్ నెలలో జరిగే జాతీయ స్థాయి నృత్య పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాల కేంద్రం తల్లిదండ్రుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్ రెడ్డి, సృజన, శ్రావణ్, అనూష, రుచిత, లక్ష్మణ్, చంద్రకళ దేవి, సునీల్, ఈశ్వర్ పాల్గొన్నారు.

